క్లుప్తంగా

ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ



ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా అస్పత్రిలో ఆదివారం ఆస్పత్రి వైద్యాధికారి చరణ్‌తో కలిసి సంస్థ సభ్యులు రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం ఆశా వర్కర్లు సొసైటీ సభ్యులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి పంపయ్య, సంస్థ సభ్యులు మనోహర్, మణికుమార్, రాజాబాబు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారుకలు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం రోడ్డు సెఫ్టీ అవగాహన కార్యక్రమంలో భాగంగా సాయంత్రం మండల పరిధిలోని కలుగోట్ల రోడ్డులో వాహనదారులకు రూరల్ ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వాహనదారుడు మద్యం సేవించి బైక్ నడపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, బైక్‌ను నెంబర్ ప్లేట్స్ లేకుండా వాహనం నడపరాదని చెప్పారు. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా బైక్ నడిపినా కేసులు నమోదు చేయటంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మహేష్‌బాబు అభిమానుల రక్తదానం



పట్టణంలో రక్తదానం చేస్తున్న మహేష్ బాబు అభిమాన సంఘ నాయకుడు

ఎమ్మిగనూరుటౌన్: సినీ నటుడు మహేష్ బాబు జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలోని శ్రీనివాస సినిమా థియేటర్‌లో అభిమాన సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అభిమాన సంఘం అధ్యక్షుడు ప్రిన్స్ వహబ్, థియేటర్ యజమానులు నాగిరెడ్డి, వంశిరెడ్డి కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. అనంతరం పట్టణంలోని మహత్మాగాంధీ బ్లడ్‌సెంటర్‌లో అభిమానులు రక్తదానాన్ని చేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘ నాయకులు ఆనంద్, శ్రీనివాసులు, మధు, ఫిల్మ్ ఆర్ట్ డైరెక్టర్ మణికంఠ, అరుణ్, సుమేద్, గిరీష్ ,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

402 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



అన్నదానం చేస్తున్న ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షలకు గర్భిణులు శనివారం ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. 402 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సుధా చెప్పారు. స్కానింగ్ పరీక్షల్లో గైనకాలజిస్ట్ డాక్టర్లు సుజిత, ఫాతిమా ఉన్నారు. ప్రభుత్వాసుపత్రికి స్కానింగ్ పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

సెక్యూరిటీ సూపర్‌వైజర్‌కు గాయాలు



గాయపడిన సూపర్‌వైజర్ బాలుచంద్రను ఆసుపత్రికి తరలిస్తున్న సెక్యూరిటీ గార్డ్స్

మంత్రాలయం రూరల్ : శ్రీమఠం సెక్యూరిటీ విభాగం సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బాలచంద్ర గాయపడ్డారు. శనివారం భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షణలో భాగంగా బారికేడ్‌ను సర్దుతుండగా కాలికి బలంగా తగిలింది. దీంతో ఆయన అక్కడే కూలిపడిపోయాడు. గమనించిన సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే ఆయన్ని వీల్ చైర్ సాయంతో శ్రీమఠం ప్రాంగణం నుంచి బయటకు తెచ్చారు. అనంతరం మఠం ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

పేదల ఆత్మాభిమానంతో చెలగాటం!

- ప్రజల కనీస అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలది
- పేదలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పేద కుటుంబాల బాధ్యతను పీ4 పేరుతో సంపన్నులకు అప్పగిస్తున్న కూటమి సర్కారు
- ప్రజాసంఘాల నుంచి వ్యక్తమవుతున్న విమర్శలు



అధికారులకు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ (ఫైల్)

ఆదోని సెంట్రల్: అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను సంపన్నుల సాయంతో పైకి తెచ్చి బంగారు కుటుంబాలుగా తీర్చి దిద్దుతామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. అందులో భాగంగానే పీ–4 పథకం తెరపైకి తెచ్చింది. పీ–4 అంటే (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్స్ పార్టనర్‌షిప్) అర్థం. ఈ పథకం అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం తడబడుతోంది. ప్రజల కనీస అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. పీ–4 పేరుతో ఆ బాధ్యతను సంపన్నులకు అప్పటించడం పేదల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ పిలుపునకు సంపన్నుల నుంచి సరైన స్పందన లేక పోవడంతో రీ సర్వేల పేరట కాలయాపన చేస్తుంది.

4,825 కుటుంబాల గుర్తింపు

ఆదోని పట్టణంలో 42 సచివాలయాలలో 4,825 కుటుంబాలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఈ కుటుంబాలను సచివాలయ సిబ్బందితో పాటు కౌన్సిలర్లు, సంపన్న వర్గాలకు చెందిన వారు అడాప్ట్ చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. సంపన్నులను గుర్తించి వారిని పీ–4 మార్గదర్శులుగా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంచింది. దీంతో కొంత మంది సచివాలయం సిబ్బంది ఇద్దరు, ముగ్గురు, కౌన్సిలర్లు, సంపన్నులు 2,580 మందిని అడాప్ట్ చేసుకున్నారు. తొలత ఈ పథకాన్ని ఉగాదికి అమలులోకి తెస్తామని చెప్పినప్పటికీ ఇప్పటికీ పథకం కార్యరూపం దాల్చడం లేదు. అయితే అట్టడుగున ఉన్న అసలైన కుటుంబాలను గుర్తించేందుకు సచివాలయం సిబ్బంది చేత మళ్లీ రీ సర్వే చేయిస్తోంది. రీ సర్వే పేరట ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల్లో గ్యాస్ కనెక్షన్ లేకుండా ఉండాలి, ఇంటికి విద్యుత్ కనెక్షన్ లేని కుటుంబం, ఉద్యోగం, రెంట్, ఇంటరెస్ట్, పెన్షన్ లేని, ఆదాయం లేని కుటుంబాలు, బ్యాంకు ఖాతా లేని కుటుంబం వీటిలో ఏదో ఒకటి వర్తించిన వారు అర్హులవుతారు.

సంపన్నుల చెప్పుచేతల్లో పెట్టేందుకు!

పేదలు ప్రభుత్వ పథకాలు ద్వారా లబ్ధి పొందితే ఎవరికీ జవాబుదారీగా ఉండాల్సిన పని లేదు. అది వారు తమ హక్కుగా భావిస్తారు. ప్రజల కనీస అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదరికమే ప్రమాణికంగా తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలను అందించారు. ఆ బాధ్యతలను విస్మరించి కూటమి ప్రభుత్వం వారిని సంపన్నులకు అప్పగించడమే కాకుండా పేదల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం మరొకరితో సాయం ఇప్పించి పేదలను వారి చెప్పుచేతుల్లోకీ తీసుకోవడమే అవుతుందని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం బాగానే ఉన్నా భవిష్యత్తులో ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందంటున్నారు.

ఆసక్తి చూపని సంపన్న వర్గాలు

సంపన్న వర్గాలకు చెందిన వారు కూడా ఈ పథకంపై అంతగా ఆసక్తి చూపడం లేదు. ఆగస్టు 15వ తేదీ నాటికి మార్గదర్శులను గుర్తించాలని అధికారులపై ఒత్తిడి చేయడంతో తప్పని పరిస్థితిలో కొంతమంది ఉద్యోగులు, కౌన్సిలర్లు అడాప్ట్ చేసుకున్నారు. అయితే కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నా, ఫోర్ వీలర్, 200 యూనిట్లు పైబడి విద్యుత్తు వినియోగం, 5 ఎకరాలు కన్నా ఎక్కువ భూమి, లేదా 2 ఎకరాలు కన్నా ఎక్కువ మగాణి భూమి కలిగిన వారు అనర్హులుగా గుర్తిస్తారు. మరి ఎంతవరకు ఈ పథకం అమలులోకి వసుదో వేచి చుడాల్సిందే.

ఎల్లెలీ లో గుర్రపుడెక్క

గోనెగండ్ల: మండల కేంద్రం తుంగభద్ర దిగువ కాలువ గుర్రపుడెక్కతో నిండిపోయింది. దీంతో కాలువలో నీటి ప్రవాహం వేగం తగ్గింది. ఎల్లెల్సీ కాలువకు నీటిని విడుదల చేసే ముందు సంబంధిత అధికారులు కాలువలో ఉన్న వ్యర్థాలు, ముళ్ల పొదలు తొలగించాల్సి ఉంది. అయితే గోనెగండ్ల సెక్షన్ పరిధిలో కాలువ బ్రిడ్జి దగ్గర వాటిని తొలగించకపోవడంతో అలాగే ఉండి పోయాయి. గోనెగండ్ల నుంచి కిందకు వెళ్లే నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క, మొక్కల వ్యర్థాలు అడ్డుపడుతున్నాయి. ఈ కాలువ నుంచి గోనెగండ్ల సెక్షన్‌లోని పానకలదిన్నె కాలువ, ఎంఎల్ఎస్పీ కాలువలకు నీటి విడుదల అవుతుంది. అలాగే అలువాల ఎస్ఎస్ ట్యాంక్‌ను కూడా ఈ కాలువ ద్వారానే నింపుకోవాలి. కోడు మూరు సెక్షన్‌కు కూడా ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంది. గోనెగండ్ల సెక్షన్ దిగువ కాలువకు 150 క్యూ సెక్కుల నీరు వస్తుంది. అందులో ఎల్లెల్సీ నుంచి జీడీపీలోకి 40 క్యూసెక్కుల నీరు మళ్లించి మిగిలిన నీటిని కాలువలకు మళ్లిస్తున్నారు. అయి తే గుర్రపుడెక్కల కారణంగా నీటి ప్రవాహం తగ్గుతోంది.



గోనెగండ్ల వద్ద కాలువలో గుర్రపుడెక్క

మోసానికి గ్యారెంటీ చంద్రబాబు



క్యూఆర్ కోడ్ పత్రాన్ని ప్రజలకు అందజేస్తున్న మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నాయకులు

కౌతాళం: సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేయడంలో గ్యారెంటీ ఇస్తాడని , ఎలాంటి అభివృద్ధిని చేయకుండా ప్రచార అర్భాటం చేస్తారే తప్ప ప్రజలకు ఏదీ అమలు చేయడని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఎంపీపీ అమరేష్ అన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని చిరుతపల్లి, మల్లన్నహాట్టి, కరణి, తిప్పలదొడ్డి గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు నర్సింహ, గోవిందు, సర్పంచ్ పుష్పలత ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి క్యూఆర్ కోడ్‌తో బాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ అంటూ ఇప్పటి వరకు ఒకటి రెండు పథకలే తప్ప చేసిందేమిలేదన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, వెంకటరామిరెడ్డి, అబ్దుల్‌సమద్, అనిల్‌కుమార్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్‌లు అవతారం, రౌడూరు సుధాకర్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, వడ్డెరామన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు పార్టీలకు అతీతంగా బీజేపీ జెండా లేకుండా కేవలం జాతీయ జెండా చేతపట్టి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఆదివారం పట్టణంలో నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితులు, హైకోర్ట్ సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా టెర్రరిస్ట్‌లపై పోరాటం చేసిన దేశ సైనికులకు మద్దతుగా నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీలో విద్యార్థులు, యువత, పార్టీలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దయాసాగర్, తొగట నరసింహులు, లలిత్‌కుమార్, జగ్గాపురం చిన్న ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో హీమో ఫిలియా వ్యాధి నయం

గోనెగండ్ల : ఫిజియోథెరపీ ద్వారా హీమోఫిలియా వ్యాధిని నయం చేయవచ్చని వైద్యులు రంగరవళి, విశ్వనాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చాప్టర్ హీమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని హిమోఫిలియా వ్యాధి గ్రస్తులకు అవగాహన కార్యక్రమాన్ని హీమోఫిలియా సొసైటీ సభ్యులు పార్థసారథి, నాగరాజు నిర్వహించారు. వైద్యులు ఫిజియోథెరపీతో ఏ విధంగా వ్యాధి నివారణ చర్యలు తీసుకోవచ్చునో వివరించడమే గాక వ్యాధి గ్రస్తులకు చికిత్సనందించారు. ఇంటాస్ ఫౌండేషన్ వారు ఉమ్మడి జిల్లాలోని 60 మంది వ్యాధి గ్రస్తులకు ఫిజియోథెరపీ కిట్లను, మందులను అందజేసి జాగ్రత్తలను వివరించారు.

కూటమి నాయకులవి ఒట్టి మాటలే



కూటమి నాయకులు భమిపూజ చేసి వదిలేసిన రోడ్డును చూపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: రాష్ట్రంలో కూటమి నాయకులవి ఒట్టి మాటలే తప్పా ఆచరణ మాత్రం శూన్యమేనని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మూగలదొడ్డి, చిర్తనకల్లు గ్రామంలో గ్రామ నాయకులు సోమేష్, రమేష్‌ల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. వారు మాట్లాడుతూ.. మూగలదొడ్డి గ్రామానికి క్రాస్ రోడ్డు నుంచి రూ.1.35కోట్లుతో బీటీ రోడ్డు వేయిస్తున్నామని జూన్ నెలలో కూటమి నాయకులు భూమి పూజ చేశారన్నారు. రెండు నెలల గడిచినా రోడ్డు వేసిన దాఖలాలు లేవని.. ఇది కూటమి పరిపాలన తీరు అని విమర్శించారు. నాడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన నేడు కూటమి ప్రభుత్వ పరిపాల తీరు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మండల నాయకులు బసిరెడ్డి, గానిగ వీరస్వామి, కొరివి నాగరాజు, కట్టెల నరసింహులు, ప్రవీణ్‌కుమార్, అంజి. విజయ్‌కుమార్, ప్రతాప్, కృష్ణ, రాము, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బాబు పాలనలో అంతా మోసమే



వి.తిమ్మాపురంలో ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న నాయకులు

మంత్రాలయం రూరల్ : కూటమి ప్రభుత్వ సీఎం చంద్రబాబు పాలనలో అంతా మోసమే ఉందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని వగరూరు, వి.తిమ్మాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బాబు ప్రభుత్వ మోసాలను ఎండగట్టారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో కేవలం టీడీపీ కార్యకర్తలను పోషించడం తప్ప సామాన్య ప్రజలకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు.

డిప్యూటీ కమిషనర్ బదిలీని ఆపండి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం డిప్యూటీ కమిషనర్ విజయరాజు బదిలీని వెంటనే ఆపాలని సీపీఎం నాయకులు డిమాండు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత విజయరాజు దాతల సహకారంతో అనతికాలంలోనే ఏ అధికారి, రాజకీయ నాయకుడు కాని చేయలేని అభివృద్ధిని చేసి చూపించారని, అలాంటి అధికారిని బదిలీ చేయించడం ఏమిటన్ని ప్రశ్నించారు. నిజాయితీగా పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకుని పోయి సొంత ఆలోచనతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్న తరుణంలో కొంత మంది అర్చకులు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులకు నచ్చక, తమ ఆదాయం ఎక్కడ కోల్పతామో అన్న భయంతో బదిలీ చేయించారని ఆరోపించారు.

హామీల అమలుపై ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్టీయూ అసోసియేటెడ్ అధ్యక్షులు పి. నాగేంద్రప్ప

ఆదోని సెంట్రల్: ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్టీయూ అసోసియేట్ అధ్యక్షుడు పి.నాగేంద్రప్ప తెలిపారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవనంలో సీనియర్ నాయకుడు వి. శ్రీనివాసులు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో సీపీఎస్ విధానాన్ని సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇస్తామన్నారు. ఇంతవరకు ఆ ఊసే లేదని, మెరుగైన పీఆర్సీ ఇస్తామని, ఇంతవరకు కమిటినే వేయలేదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు టి. కాశీవిశ్వనాథ్ శాస్త్రి, కె. నాగ ప్రసాద్, ఎం. శ్రీనివాసులు, బిజ.ఓ్యతిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు కులుమాల, అలువాల, గాజులదిన్నె, పెద్దనేలటూర్, చిన్న నేలటూర్, హెచ్. కైరవాడి, గంజిహళ్లి, వేముగోడు, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోదరీ సోదరుల మధ్య అనురాగానికి ప్రతీకగా కుల, మత, వయో బేధం లేకుండా పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే దేవాలయాలకు వెళ్లి సోదర, సోదరీ ప్రేమ కలకాలం ఉండాలని రక్షాబంధన్‌ను కట్టుకున్నారు.

మార్కండేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం

కోసిగి: మండల కేంద్రంలో వెలసిన పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం భక్త మార్కండేయ స్వామి శ్రావణమాస ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అలయ ధర్మకర్త వై ఆంజనేయులు ఆధ్వర్యంలో పద్మశాలి కులబాంధవులు స్వామి వారికి గంగ పూజ, నందికోళ్ల పూజలతో ఉత్సవాలు అంకుర్పారణ పలికారు. నేడు తుంగభద్ర నది జలాలతో అభిషేకాలు గావించి , స్వామి వారి ఊంజల సేవా కార్యక్రమం నిర్వహించనున్నారు.



నంది కోళ్లు పూజలు చేస్తున్న పద్మశాలి కులబాంధవులు

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి!



మాధవరం రోడ్డులో వర్షపునీటి గుంతలో ఇరుక్కుపోయిన పత్తి దిగుబడులతో వెళ్తున్న వాహనం

ఆదోని అర్బన్: పట్టణంలో రెండు రోజులుగా కురిసిన వానకు చిన్న గుంతలు పెద్దవిగా మారి చెరువులనుగా తలపిస్తున్నాయి. పట్టణంలోని మాధవరం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఆ రహదారిలో పెద్ద గుంత ఉండడంతో నీరు నిలిచి చెరువులా మారింది. దీంతో నీరున్న చోట వెళ్తేతే గుంతలో పడుతుందనే ఉద్దేశంతో పక్కనుంచి వెళ్లేందుకు ప్రయతి్నంచిన పత్తి లోడుతో వెళ్తున్న వాహనం బురదలో ఇరుక్కుపోయింది. ఆదేవిధంగా సాయంత్రం వేరుశనగకాయల దిగుబడిని తరలిస్తున్న ఎద్దులబండి కూడా నీటిలో ఇరుక్కుపోయింది. దీంతో రైతులు, వాహనదారులు వాహనాన్ని, ఎద్దులబండిని బయటకు తీసేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. రోజురోజుకు వర్షం కురవడంతో పెద్ద పెద్ద వాహనాలు బళ్లారి, ఆలూరు నుంచి మాధవరం, రాయచూరు, మంత్రాలయంకు వెళ్లేందుకు వాహనాలు ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉంటుంది. పెద్ద పెద్ద వాహనాలు అధికలోడుతో ఈ మార్గంలో వెళ్లడంతో చిన్నచిన్న గుంతలు పెద్దవిగా మారిపోయాయి. దీంతో చిన్న వర్షం వచ్చినా చెరువుగా తలపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారికి మరమ్మతులు చేయాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మూడో శ్రావణ శనివారం పూజలు





ప్రత్యేక అలంకరణలో శ్రీ రణమండల ఆంజనేయస్వామి, కొండపై భక్తుల రద్దీ

ఆదోని అర్బన్: శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా రణమండల ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు టి.జి.పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్యసేవా సమితి సభ్యులు స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, వివిధ రకాల పూల అలంకరణ, ఆకుపూజ, నైవేద్యం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. శ్రావణమాసం మూడో శనివారం ఉండడంతో పాఠశాల, కళాశాల, ప్రభుత్వ కార్యాలయాలు సెలవు రావడంతో భక్తులు రాత్రి 10 గంటల వరకు కొండలో వెలిసిన శ్రీ రణమండల ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం, మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

గంగామాత ఆలయంలో పౌర్ణమి వేడుకలు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ గంగామాత దేవాలయంలో పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం శ్రావణమాస పౌర్ణమి కావడంతో అమ్మవారికి అభిషేకాలు చేసి పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు ఉత్సవమూర్తిని పీఠంపై ఆశీనులు గావించి అభిషేకాలు, అర్చనలు, పూలతో అలంకరించారు. ఉత్సవమూర్తిని పల్లకీలో ఉంచి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు తెలుగు ఈరన్న, మేఘనాథ్, దుల్లయ్య, కార్పెంటర్ ఈరన్న, దీపక్‌బాబు, కృష్ణమూర్తి, మార్కెట్‌యార్డు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో భక్తజన సందడి



క్యూ లైన్‌లో తరలివస్తున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ శనివారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు తరలివచ్చారు. శ్రావణ శుక్రవారంతో పాటు రెండవ శనివారం, ఆదివారం మూడు రోజుల పాటు సెలవు రోజులు కలిసి రావడంతో శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, విఐపీ దర్శనంల ద్వారా భక్తులకు సౌకర్యం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగింది. తెల్లవారుజామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు.



జ్యోతుల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



కత్తులతో విన్యాసాలు చేస్తున్న భక్తులు

ఘనంగా జ్యోతి ఉత్సవాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కడపాళెం, సిద్ధప్ప పాళెం కాలనీలలో వెలసిన తొగట వీరక్షత్రీయుల ఆరాధ్య దైవం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం కులబాంధవుల మధ్య కమనీయంగా సాగింది. శనివారం శ్రావణ మాస మాగశుద్ధ పౌర్ణమి రోజున సంప్రాదాయబద్ధంగా జ్యోతి మహోత్సవాలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి ఆలయ అర్చకులు గోవిందు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీ అధ్యక్షులు ఓంప్రకాష్, డీసీ నారాయణ ఆధ్వర్యంలో కులబాంధవులు అమ్మవారి జ్యోతిలను వెలిగించుకుని అక్కడ నుంచి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కలశాలతో ఊరేగింపు బయలు దేరారు. ఆలయం చెంతకు చేరుకుని అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో భక్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



నోట్లో శూలం గుచ్చుకున్న భక్తురాలు

ఇసుక లారీ సీజ్

ఆదోని అర్బన్: పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను టూటౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్‌నాథ్ తెలిపారు. శుక్రవారం రాత్రి తనిఖీలో భాగంగా లారీని నిలిపి రికార్డులను తనిఖీ చేయగా.. ఇసుకకు సంబంధించిన రసీదు చూపకపోవడంతో లారీని సీజ్ చేశామన్నారు. వెంటనే అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను జిల్లా మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించామన్నారు.